# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-05-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఎన్నికల తనిఖీల్లో  భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 342 కోట్ల రూపాయల విలువైన నగదు, సామగ్రిని జప్తు చేశామని రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు.**
2. **రాష్ట్రంలో పాలిటెక్నిక్ డిప్లొమా చేసిన విద్యార్థులకు బీటెక్, బీఫార్మసీల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీ ఈసెట్ ఫలితాలు ఈరోజు విడుదలయ్యాయి.**
3. **సార్వత్రిక ఎన్నికల్లో చివరిదైన 7వ దశ  ఎన్నికల ప్రచారం ఈరోజు సాయంత్రం 5 గంటలతో ముగుస్తుంది.**
4. **రాష్ట్రంలో రానున్న ఐదు రోజుల పాటు ఉష్ణోగ్రత, వడగాల్పుల తీవ్రత కొనసాగుతుందని అమరావతి  వాతావరణ కేంద్రం  తెలిపింది.**

==============================

సార్వత్రిక ఎన్నికల సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 342 కోట్ల రూపాయల విలువైన నగదు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఓ ప్రకటనలో వెల్లడించారు. ఎన్నికల తనిఖీల్లో భాగంగా ఇప్పటివరకు  107.96 కోట్ల రూపాయల నగదు జప్తు చేయగా... వాటిని అక్రమంగా తరలిస్తున్న 7 వేల 305 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.  వాటితో పాటు 58.78 కోట్ల విలువైన అక్రమ మద్యాన్ని.. 35.61 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను జప్తు  చేశామన్నారు. ఇందుకు రాష్ట్రంలోని  31 సరిహద్దుల్లో 150 తనిఖీ కేంద్రాల్లో పోలీసు, సెబ్, వాణిజ్య పన్నుల శాఖ, రవాణా, రెవెన్యూ విభాగాల సిబ్బందితో నిఘా పెట్టినట్లు డీజీపీ  పేర్కొన్నారు.

-------------------------

రాష్ట్రంలో పాలిటెక్నిక్ డిప్లొమా చేసిన విద్యార్థులకు బీటెక్, బీఫార్మసీల్లో  ప్రవేశానికి నిర్వహించిన ఏపీ ఈసెట్ ఫలితాలు ఈరోజు విడుదలయ్యాయి. అనంతపురం జేఎన్‌టీయూలో ఈసెట్ ఛైర్మన్ శ్రీనివాసరావు, కన్వీనర్ భానుమూర్తి ఈసెట్  ఫలితాలను విడుదల చేశారు. మే 8న ఏపీ ఈసెట్ పరీక్షలు నిర్వహించగా.. రాష్ట్రవ్యాప్తంగా 36,369 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాల్లో 90.41 శాతం ఉత్తీర్ణత నమోదైయిందని, ఫలితాలను ఏపీ ఈసెట్ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని అధికారులు  తెలిపారు. కాగా రాష్ట్రంలో ఎంసిఏ, ఎంబిఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఐసెట్ పరీక్షా ఫలితాలు ఈరోజు సాయంత్రం అధికారులు విడుదల చేస్తారు.

-------------------------

రాష్ట్రంలో రానున్న ఐదు రోజుల పాటు ఉష్ణోగ్రత, వడగాల్పుల తీవ్రత కొనసాగుతుందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఉదయం 11గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ప్రజలు ఇళ్ళ వద్దనే ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. కాగా నిన్న రాష్ట్రంలో 195 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 147 మండలాల్లో వడగాల్పులు వీశాయని పేర్కొంది.

---------------------------

అటవీ సంపద వివరాలను డిజిటలైజేషన్ చేసేందుకు కార్యాచరణ ప్రారంభించామని చింతపల్లి డివిజినల్ ఫారెస్టు అధికారి సూర్యనారాయణ తెలిపారు. నిన్న అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో అటవీశాఖ ఉద్యోగులకు వన యాప్ వినియోగంపై అధికారులు రెండు రోజుల శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో అటవీ సంపదను జీపీఎస్ సహాయంతో చిత్రాలతో కూడిన ఖచ్చితమైన సమాచారాన్ని డిజిటలైజేషన్ చేయడం వల్ల నిర్దిష్టమైన సమాచారం తెలుసుకునే వీలు ఉంటుందని వివరించారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జూన్ 4వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపునకు రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎమ్.విజయ సునీత పాడేరులో ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్‌ల ఓట్ల లెక్కింపునకు వేరువేరుగా బల్లలను ఏర్పాట్లు చేశామని అన్నారు. ఏలూరు జిల్లాలో త్వరితగతిన ఫలితాలను ప్రకటించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని పల్నాడు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేష్ లాట్కర్ అన్నారు. చిత్తూరు జిల్లాలో ఓట్ల లెక్కింపు సమయంలో బాణాసంచా, ఊరేగింపుపై నిషేధం కొనసాగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు.

---------------------------

పోలవరం ప్రాజెక్టు–అథారిటీ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా అతుల్ జైన్ ను కేంద్రం ప్రభుత్వం నియమించింది. ప్రస్తుత పోలవరం ప్రాజెక్టు–అథారిటీ అధికారి శివనందన కుమార్ ఈనెల 31న పదవీ విరమణ చేయనుండటంతో కేంద్ర జల్ శక్తి శాఖ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న అతుల్ జైను పీపీఏ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర జల్ శక్తి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

---------------------------

ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా తెలిపారు. నిన్న ఢిల్లీ నుంచి సీనియర్ ఉప ఎన్నికల కమిషనర్ నితీష్‌వ్యాస్ దృశ్యమాధ్యమం ద్వారా నిర్వహించిన సమావేశంలో ముకేష్ కుమార్ మీనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ 4న రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య అన్ని నియోజకవర్గాల తుది ఫలితాలు ప్రకటించేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 111 నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 2 గంటలకు, 61 నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటలకు, మిగతా మూడు నియోజకవర్గాల్లో సాయంత్రం 6 గంటల్లోపు

లెక్కింపు ప్రక్రియ పూర్తిచేస్తామని వెల్లడించారు. సమస్యాత్మక జిల్లాల్లో లెక్కింపు రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 144 సెక్షన్‌ను అమలుచేస్తున్నామని పేర్కొన్నారు.

---------------------------

క్షయ వ్యాధి నియంత్రణ టీకా కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కృష్ణా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి. గీతాబాయి వైద్య సిబ్బందిని ఆదేశించారు. నిన్న మచిలీపట్నంలో వైద్యాధికారులు, సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గీతాబాయి మాట్లాడుతూ వైద్యాధికారులు, సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని క్షేత్రస్థాయి సిబ్బంది.. వారి పరిధిలోని గృహాలను సందర్శించి నీటి నిల్వలను తొలగించడం, కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించాలని తెలిపారు.

---------------------------

పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ–డీఆర్డీఓ రూపొందించిన రుద్ర ఎం–2 క్షిపణి పరీక్ష విజయవంతమైందని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఒడిశా తీరం నుంచి ఎసయూ–30 ఫైటర్ జెట్ ద్వారా ప్రయోగించిన రుద్ర నిర్దేశించిన అన్ని లక్ష్యాలను అందుకుందని తెలిపింది. డీఆర్డీఓకు చెందిన పరిశోధన సంస్థలు రూపొందించిన సాంకేతికతలతో పలురకాల శత్రు లక్ష్యాలను చేధించేందుకు రుద్ర క్షిపణిని అభివృద్ధి చేసినట్లు అధికారులు తెలిపారు. రుద్ర ఎం–2ను విజయవంతంగా పరీక్షించిన డీఆర్డీఓ, భారత వాయు దళాన్ని రక్షణశాఖ మంత్రి రాజనాధ్ సింగ్ అభినందించారు. రుద్ర ఎం–2 క్షిపణి పరీక్ష విజయవంతం కావడం భారత సాయుధబలగాల బలాన్ని రెట్టింపు చేస్తుందని పేర్కొన్నారు.

---------------------------

ఖరీఫ్ పంటల సాగుకు ప్రణాళికలు రూపొందించామని వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ సి. హెచ్. హరికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనం నుంచి కోత వరకు రైతులకు అన్ని విధాలుగా సహాయం అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఖరీఫ్ సీజన్ కోసం 6.32 లక్షల క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలను సిద్ధం చేశామని, వీటిలో ప్రధానంగా 2.24 లక్షల టన్నుల వరి, 2.99 లక్షల టన్నుల వేరుశనగ, 84 వేల టన్నుల పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తామని చెప్పారు. ఎరువులతో పాటు నానో యూరియా, నానో డీఏపీను కూడా రైతులకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని హరికిరణ్ పేర్కొన్నారు.

---------------------------

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల గణితం జవాబు పత్రాలను ఆన్‌లైన్ మూల్యాంకనం చేయనున్నామని ప్రభుత్వ పరీక్షల విభాగం తెలిపింది. ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్న ఈ ప్రక్రియకు పదో తరగతి బోధిస్తూ మూడేళ్ల అనుభవం ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు గూగుల్ ఫామ్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని ప్రభుత్వ పరీక్షల విభాగం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆన్‌లైన్ మూల్యాంకనానికి ఒక్కొక్కరికి 75 పేపర్లు ఇవ్వనున్నామని తెలిపింది.

---------------------------

సార్వత్రిక ఎన్నికల్లో చివరిదైన 7వ దశ ఎన్నికల ప్రచారం ఈరోజు సాయంత్రం 5 గంటలతో ముగియనుంది. దీంతో దేశంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగుస్తుంది. ఈ దశలో ఏడు రాష్ట్రాలు, ఒక

కేంద్రపాలిత ప్రాంతాల్లోని 57 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. జూన్ 1వ తేదీన ఓటింగ్ జరగనుంది. అన్ని స్థానాలకు పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంది.

---------------------------

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఈరోజు కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో కౌంటింగ్ కేంద్రాలను, స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసి అధికారులతో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. అనంతరం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం చేరుకుని ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ, విష్ణు కాలేజీలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను, స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేశారు.

======================